క్లుప్తంగా

ఏర్పాట్లను పరిశీలించిన డీసీపీ



వేలేరు : మండలంలోని మల్లికుదుర్ల గట్టు మల్లికార్జునస్వామి ఆలయాన్ని డీసీపీ ఎంఏ బారి బుధవారం సందర్శించారు. మహాశివ రాత్రి సందర్భంగా నిర్వహించే జాతర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. జాతరకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున తాగునీరు, వైద్యం తదితర ఏర్పాట్లు పరిశీలించారు. శాంతిభద్రతల ఏర్పాట్లను పర్యవేక్షించి పోలీస్ అధికారులకు సూచనలు చేశారు. ఆయన వెంట కాజీపేట ఏసీపీ తిరుమల్, ధర్మసాగర్ సీఐ మహేందర్, వేలేరు ఎస్సై డి.హరిత ఉన్నారు.

నియామకం



శాయంపేట : తెలుగు బుక్ ఆఫ్‌రికార్డు హనుమకొండ జిల్లా చీఫ్ కోఆర్డినేటర్‌గా మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన కొమనేని రఘు నియామకమయ్యారు. తాను చేసిన రికార్డ్స్‌సెర్చ్‌కు అందించిన సేవలను గుర్తించి జిల్లా చీఫ్ కో ఆర్డినేటర్‌గా నియమించడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా అశోక్‌రెడ్డి



కమలాపూర్ : మండలంలోని శంభునిపల్లికి చెందిన కట్కూరి అశోక్‌రెడ్డిని భారతీయ జనతా పార్టీ కమలాపూర్ మండల అధ్యక్షుడిగా నియమించినట్లు ఆ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావుపద్మ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా కట్కూరి అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో రెండోసారి మండల అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, మాజీ మంత్రి ఈటల రాజేందర్, హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావుపద్మ, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

దామెర అధ్యక్షుడిగా నాగరాజు



దామెర : బీజేపీ మండల అధ్యక్షుడిగా మండలంలోని కోగిల్వాయికి చెందిన జంగిలి నాగరాజు నియామకమయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ బుధవారం ఉత్వర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజయ్‌చందర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాశీప్రసాదరావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

చర్చిలో కాంగ్రెస్ శ్రేణుల ప్రార్థనలు



ధర్మసాగర్ : మండలంలోని కరుణాపురంలో గల క్రీస్తుజ్యోతి ప్రార్థన మందిరంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిరకు వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ టికెట్ వచ్చేలా చూడాలని వేడుకున్నారు. ఎంపీ అభ్యర్థిగా ఇందిరకు అవకాశం కల్పిస్తే భారీ మెజారిటీతో గెలిపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కోఆర్డినేటర్ కొత్తపల్లి భిక్షపతి, చిల్పూర్ మండల అధ్యక్షుడు గడ్డమీది సురేష్, నాయకులు రవీందర్, దయాకర్, నాగయ్య, శ్రీను, రాజు, వెంకటయ్య, మల్లేష్, రాజు, వసంత, సురేష్, సారయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ కార్యాలయ ఆవరణలో గురువారం విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు ఏర్పాటు చేస్తున్నట్లు టీఎస్ ఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ తిరుమల్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చటం, ఓల్టేజీ హెచ్చుతగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలు ఉన్న మీటర్లు మార్చడం, నూతన సర్వీసుల మంజూరు, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీసు పేరు మార్పు, కేటగిరి మార్పు, సర్వీస్ రద్దు వంటి సమస్యలను పరిష్కరించేందుకు లోకల్‌కోర్టు నిర్వహించనున్నట్లు తెలిపారు. ధర్మసాగర్, పంథిని, ఐనవోలు మూడు మండలాల విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 01 గంట వరకు ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు తెలిపారు. మండలంలోని విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళలు మహాశక్తివంతులు

- అన్నిరంగాల్లో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు
- సబ్‌రిజిస్ట్రార్ కె.సునీత
- బిట్స్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం



పరకాల : సబ్‌రిజిస్ట్రార్ సునీతను సన్మానిస్తున్న బిట్స్ ఉపాధ్యాయురాళ్లు, విద్యార్థులు

పరకాల : నేటి సమాజంలో మహిళలు రాజకీయ, విద్య, వైద్య, వైమానిక, సైనిక రంగాల్లో రాణించడం ఎంతో సంతోషకరమని పరకాల డివిజన్ సబ్ రిజిస్ట్రార్ కె.సునీత అన్నారు. స్త్రీని దేవతగా పూజించడం, విశ్వసృష్టికర్తగా సర్వోన్నత శక్తిగా ఆరాధించే గొప్ప సంస్కృతి భారతదేశంలో ఉండడం గర్వంగా ఉందన్నారు. పట్టణంలోని బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్‌లో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల మాతృమూర్తులందరితో పాఠశాల యాజమాన్యం క్రీడా పోటీలు, వివిధ ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థులతో పాదాభివందనం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. స్త్రీలను గౌరవించుకుంటూ బిట్స్ యాజమాన్యం మహిళ దినోత్సవ వేడుకలను నిర్వహించడం అభినందనీయమన్నారు. బిట్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. స్త్రీలను గౌరవించుకున్నచోట దేవతలు ఉంటారని, మనందరి మొదటి గురువు అమ్మ అని తెలిపారు. అమ్మను కంటికి రెప్పలా కాపాడుకోవాలిసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇంటి వద్ద పిల్లలను క్రమశిక్షణతో ఉంచాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బిట్స్ ప్రిన్సిపాల్ జోసఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : మహిళలు ఆర్థికంగా ఎదగాలని సీడీపీఓ భాగ్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ప్రపంచమహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె హాజరై మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధిని సృష్టించుకొని ఆర్థికంగా ఎదగాలని అన్నారు. పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను సన్మానించారు. ఇటీవల అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు, బెస్ట్ టీచర్ అవార్డులను అందించారు. అనంతరం సీడీపీఓను అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు శాలువాతో సత్కరించారు.



ధర్మసాగర్ : మాట్లాడుతున్న అంగన్‌వాడీ టీచర్లు



శాయంపేట : సీడీపీఓ, సూపర్‌వైజర్లను సన్మానిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ధర్మసాగర్‌లో..

ధర్మసాగర్ : మహిళలు, ఆడపిల్లలపై జరుగుతున్న హింసను రూపుమాపి హింసరహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతిఒక్కరూ పాటుపడాలని అంగన్‌వాడీ టీచర్లు కోరారు. మండలంలోని నారాయణగిరి గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం అంగన్‌వాడీ టీచర్లు సంతకాల సేకరణ చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మహిళలు, ఆడపిల్లల రక్షణ కోసం హింసరహిత సమాజాన్ని సృష్టించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మహిళలతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు స్వరూప, పరమేశ్వరి, రాజేశ్వరి, మంజుల, ఆయాలు, మహిళలు పాల్గొన్నారు.

ప్రజల సహకారం ఎప్పటికీ మర్చిపోలేనిది

- ఆత్మీయ వీడ్కోలులో ఎంపీడీఓ భాస్కర్

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు తనపై చూపిన అభిమానం, సహకారం మరచిపోలేనిదని ఎంపీడీఓ ఎల్.భాస్కర్ అన్నారు. భీమదేవరపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులకు బదిలీలు సహజమన్నారు. విధుల్లో భాగంగా ప్రజాప్రతినిధులు, ప్రజలు, ఆయా శాఖల అధికారులు తనకు అందించిన సహకారం గొప్పదన్నారు. మండల అభివృద్ధిలో తనకు సహకరించినట్లుగానే నూతనంగా వచ్చిన ఎంపీడీఓ వీరేశంకు సహకరించి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఉద్యోగులు పనిచేసిన చోటు మంచి పేరుతెచ్చుకోవడం కంటే అదృష్టం మరోకటి లేదన్నారు. అనంతరం ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు ఆయనకు శాలువా కప్పి సత్కరించి జ్ఞాపికను అందించారు. ఎంపీపీ అనితారమేష్, జెడ్పీటీసీ వంగ రవీందర్, ఎంపీడీఓ వీరేశం, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.



ఎంపీడీఓ భాస్కర్‌ను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

గ్రామాల అభివృద్ధికి అందరూ కృషిచేయాలి

- ఎంపీపీ అనిత

ఎల్కతుర్తి : గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎంపీపీ జక్కుల అనితారమేష్ అన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో నీటిఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. భీమదేవరపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ జక్కుల అనిత అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు నివేదికలు చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. ఇళ్లు నిర్మించుకునే వారికి రిజిస్ట్రేషన్ ఇబ్బందులు తలెత్తకుండా జిల్లాస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య త్వరగా పరిష్కరమయ్యే విధంగా చర్యలు చేపడుతామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకెళ్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ వీరేశం, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ జక్కుల అనిత

స్క్రాప్ గోడౌన్‌లో చెలరేగిన మంటలు



కమలాపూర్ : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న స్క్రాప్ దుకాణ గోడౌన్‌లో బుధవారం రాత్రి ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించింది. గోడౌన్‌లో నిల్వ ఉంచిన అట్టలకు నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. పక్కనే జనావాసాలు ఉండగా సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికులు, గోడౌన్ సిబ్బంది సాయంతో మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపు జేసీబీ సాయంతో మంటలు అంటుకున్న అట్టలను అక్కడి నుంచి తొలగించారు. అనంతరం హనుమకొండ నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను పూర్తిగా ఆర్పివేశారు. దీంతో ఆస్తి నష్టం, ప్రాణనష్టం సంభవించకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి

ఆత్మకూరు : బాలికలు తమ ఆరోగ్యంపై మరింత దృష్టి సారించి కాపాడుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని హైస్కూల్‌లో బుధవారం రుద్రమదేవి స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో డాక్టర్ రజని నేతృత్వంలో బాలికలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. బాలికలకు ఉచితంగా న్యాప్‌కిన్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు న్యాప్‌కిన్స్, జ్యూట్ బ్యాగులు, పేపర్ ప్లేట్లు తయారు చేయడం సంతోషకరమన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, సాజిదాబేగం, శివప్రసాద్, యాదగిరి, రాంబాబు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి శంకర్‌రెడ్డి..?

ఐనవోలు : బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి పలువురు నాయకులతో కలిసి ఎండోమెంట్‌శాఖ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో ఆయన కొండా మురళికి అనుచరుడిగా మెదిలారు. దీంతో ఆయన కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు మండలంలో ప్రచారం జరుగగా పార్టీ మారడంపై నిర్ణయం తీసుకోలేదని ఆయన తెలిపారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి

శాయంపేట : దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్తే లక్ష్యాన్ని సాధించవచ్చని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయలంలో బుధవారం సామాజిక అధికారత శిబిర్ అలీమ్ కో ప్రోగ్రాంలో భాగంగా వికలాంగులకు, వయోవృద్ధులకు ఉచిత పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వికలాంగుల పరికరాల కోసం 2019లో దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం 6వీల్ చైర్లు, 10వాకింగ్ స్టిక్స్, 9వినికిడి పరికరాలు, 9బ్యాటరీలు, 7వాకర్స్ పంపిణీ చేయగా బుధవారం వారికి అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బాసని చంద్రప్రకాశ్, మాజీ సర్పంచ్ కందగట్ల రవి, ఎంపీడీఓ ఫణిచంద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సునితారెడ్డి, మంజుల పాల్గొన్నారు.



పరికరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ





ఆత్మకూరు, అగ్రంపహాడ్ ప్రాథమిక పాఠశాలల్లో జరిగిన స్వయంపాలన దినోత్సవంలో విద్యార్థులు

ఆత్మకూరు : మండల కేంద్రంతోపాటు మండలంలోని అగ్రంపహాడ్ గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో బుధవారం స్వయంపాలన దినోత్సవం ఘనంగా జరిగింది. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. విద్యార్థులను హెచ్‌ఎంలు లక్ష్మణ్‌రావు, ప్రభాకర్ అభినందించారు.

కార్మిక చట్టాలను రక్షించాలి

పరకాల : భవన నిర్మాణ కార్మికుల చట్టాలను రక్షించాలని సీఐటీయూ అనుబంధ యూనైటెడ్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో హమాలీ కూలీలతో బుధవారం మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులందరూ వెల్ఫేర్ బోర్డులో పేరు నమోదు చేసుకొని లేబర్ కార్డు పొందాలన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీజేపీ సర్కార్‌ను గద్దె దించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్మికులు, రైతులు, నిరుద్యోగుల పట్ల బీజేపీ సర్కార్ వైఖరిని యావత్ భారతదేశం ముక్తకంఠంతో ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులకు అన్యాయం చేస్తే ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

శాయంపేట : రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం మండలంలోని కొప్పుల, వసంతాపూర్, గంగిరేణిగూడెం, సూర్యనాయక్‌తండా, సాధోనిపల్లి, కాట్రపల్లి, నేరేడుపల్లి, ప్రగతిసింగారం, పత్తిపాక, శాయంపేట, ఆరెపల్లి, మైలారం, జోగంపల్లి, పెద్దకోడెపాక గ్రామాల్లో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా మంజూరైన రూ. కోటి 50లక్షలతో సీసీరోడ్లు, పైపులైను పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీడీఎఫ్ నిధులు రూ. 30లక్షలతో త్వరలో మండలానికి అంబులెన్స్ ఏర్పాటు చేస్తామని అన్నారు. రైతుల శ్రేయస్సు కోసం రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతు సదస్సులను ప్రభుత్వం నిర్వహించనుందని, పంటలకు గిట్టుబాటు ధర, రూ. 2లక్షల రుణమాఫీ, రైతుబంధు, రైతుబీమా అందజేస్తామన్నారు. ప్రగతి సింగారంలో అసంపూర్తిగా నిలిచిన ఫంక్షన్‌హాల్‌ను వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్లు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రగతిసింగారంలో ఎమ్మెల్యే సత్యనారాయణరావును గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు

శాయంపేట : మహాశివరాత్రి సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ శివమార్కండేయ, శ్రీవెంకటేశ్వర స్వామి, శ్రీమత్స్యగిరిస్వామి ఆలయాలను అలంకరిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్లు బాసాని సూర్యప్రకాశ్, సామల భిక్షపతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 8న మహాశివ రాత్రిని పురస్కరించుకొని ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, ప్రథమ రుద్రాభిషేకం, సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు అర్చనలు, అష్టోత్తర పూజలు, రాత్రి 9.30 గంటలకు శివపార్వతుల కల్యాణం, 12గంటలకు లింగోద్భావ పూజలు, భజన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

దామెర : మండలంలోని ఊరుగొండ శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శివపార్వతుల కల్యాణం ఘనంగా జరిగింది. వేకల్లో భాగంగా ఉదయం మహారుద్రాభిషేకం, రుద్రసహిత మహా మృత్యుంజయ హోమం నిర్వహించారు. అనంతరం శివపార్వతుల కల్యాణాన్ని వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ వైభవంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ గోగుల సత్యనారాయణరెడ్డి, విజేందర్‌రెడ్డి దంపతులు పుస్తెమట్టెలు, పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జాకిర్‌అలీ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



దామెర : కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

ఎన్నికల హామీలను త్వరగా నెరవేర్చాలి

ఐనవోలు : గొర్రెల, మేకల పెంపకందారులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆ సంఘం సంఘం జిల్లా కార్యదర్శి కాడబోయిన లింగయ్య అన్నారు. ఈ మేరకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు బుధవారం వినతిపత్రం అందించారు. హనుమకొండలోని ఆయన నివాసంలో ఐనవోలు మండల జీఎంపీఎస్ నాయకులతో కలిసి లింగయ్య వినతిపత్రం అందించి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గొర్ల పంపిణీకి బదులు రూ. 2లక్షల నగదు బదిలీ చేయాలని అన్నారు. నగదు బదిలీతోపాటు ప్రమాదవశాత్తు మరణించిన గొర్ల కాపరులకు రూ. 10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. గొర్రెల మేత కోసం ప్రభుత్వ, చెరువు శిఖాల భూములు సొసైటీలకు ఇవ్వాలని కోరారు. పలు డిమాండ్లతో కూడిన వినితిపత్రం అందించి వెంటనే నెరవేర్చాలని కోరారు. కాగా గొర్రెల పంపిణీలో పెద్ద ఎత్తున అవినీతి జరుగగా కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ జరుపుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. సాధ్యమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అమలు చేసేలా కృషిచేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల రమేష్, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్లు కొమురెల్లి యాదవ్, భరత్‌కుమార్, పర్వతాలు, కృష్ణమూర్తి, కుమారస్వామి పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న లింగయ్య

కాంగ్రెస్ పార్టీ మాట తప్పదు : రేవూరి



కమలాపూర్ : కండువా కప్పుతున్న ప్రణవ్‌బాబు



దామెర : కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న రేవూరి

నడికూడ : ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో ఆకర్షితులవుతున్న ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని, అయినప్పటికీ ఇచ్చిన ప్రతీ హామీని కాంగ్రెస్ పార్టీ నెరవేర్చుతుందన్నారు. ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తున్నామని, దీంతో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య, మాజీ ఎమ్మెల్యే భిక్షపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దేవేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

దామెర : మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. ముస్త్యాలపల్లి మాజీసర్పంచ్ వడ్డెపల్లి శ్రీనివాస్, ఊరుగొండ పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంబటి రాజస్వామి, మాజీ ఎంపీపీ, మండల సమన్వయకమిటీ సభ్యులు జన్ను మల్లయ్య చేరినవారిలో ఉన్నారు.

ప్రణవ్ సమక్షంలో..

కమలాపూర్ : ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేసిన ఆరు గ్యారంటీ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తీరును చూసి ఇతర పార్టీల నాయకులు, కార్యర్తలు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్‌బాబు అన్నారు. మండలంలోని గోపాలపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ చెరిపల్లి రామచంద్రం, ఎస్సీ కమ్యూనిటీ అధ్యక్షుడు చెరిపల్లి కుమారస్వామి బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలు సమర్థవంతంగా అమలు చేస్తున్నందున క్షేత్రస్థాయిలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ఇతర పార్టీల నాయకులు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చడంలో పార్టీ వెనుకాడబోదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కోఆర్డినేటర్ తొటం రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేశిని ఐలయ్యగౌడ్, నాయకులు ఖ్యాతం వీరేశం, పాక శ్రీనివాస్, సొల్లు బాబు, సొల్లు దశరథం, తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

హన్మకొండ: వినియోగదారుల హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సంఘాల సమన్వయ సమితి అధ్యక్షుడు డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. హనుమకొండ రాంనగర్‌లోని జిల్లా వినియోగదారుల సలహా కేంద్రంలో వినియోగదారుల చైతన్య సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని దక్షిణాది రాష్ట్రాల్లో వినియోగదారుల చైతన్య సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈనెల 10న వరంగల్, 12న కర్ణాటకలో, 13న నిజామాబాద్‌లో, 14న ఆంధ్రప్రదేశ్‌లో, 15న కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని మహారాష్ట్రలోని ముంబాయిలో నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు భాస్కర్ రెడ్డి, మనోహర్ రావు, హైమావతి, శ్రీదేవి, వినియోగదారుల సలహా సంఘం సభ్యులు పాల్గొన్నారు.